# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 172 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

10-05-2026 ఆదివారం వెల : 1 /- పేజీలు : 4


# సహకార శాఖలో పారదర్శకంగా ప్రమోషన్లు, పోస్టింగులు

- ఉద్యోగులకు సమయానికి పదోన్నతులు
- వారి ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- వ్యవసాయ,సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**నవతరం -అమరావతి**

సహకార శాఖలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 మంది వివిధ కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా, ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, పదోన్నతులు పొందిన ఉద్యోగులు విజయవాడలో వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు పదోన్నతులు త్వరితగతిన మంజూరు చేయడమే కాకుండా, పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగ్ ఆర్డర్లు జారీ చేసినందుకు ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. ప్రమోషన్లు పొందిన ఉద్యోగుల అభ్యర్థన మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేక్ కట్ చేసి ఉద్యోగులతో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడమే కాకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగులు ఇవ్వడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగులు సానుకూల వాతావరణంలో పనిచేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని, వారి హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అలాగే సహకార శాఖలో వివిధ కేడర్ల ఉద్యోగులకు జారీ చేసిన ప్రమోషన్లలో 100 శాతం పారదర్శకత పాటించామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో సహకార శాఖలో వివిధ కేడర్లలో దాదాపు 350కు పైగా ప్రమోషన్లు కల్పించబడినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో ప్రమోషన్ ప్రక్రియ అమలు చేయడం వల్ల ఈ ప్రక్రియ వేగవంతమైందన్నారు. అలాగే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇచ్చిన ఆదేశాలతో ప్రమోషన్లు, పోస్టింగులు అత్యంత పారదర్శకంగా అమలయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి జీసీబీవీ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి. విజయ్ కుమార్, పి. రాజశేఖర్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి జి. సందీప్, సహా అధ్యక్షుడు యు. రమేష్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు వై. యేసు కుమార్, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎస్. భావనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వీరాభయాంజనేయ ప్రతిష్టలో పోకతోట సింహాచలం

- తోటపాలెంలో అంగరంగ వైభవంగా ప్రతిష్ట కార్యక్రమం
- ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ
- భారీగా పాల్గొన్న భక్తులు, విహెచ్‌పీ బజరంగ్ దళ్ కార్యకర్తలు
- ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావాలని పిలుపు

2లో



# సువేందు అధికారికి రామ్మోహన్ నాయుడు శుభాకాంక్షలు

**నవతరం -అమరావతి**

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సువేందు అధికారికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కలకత్తాలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సహచర కేంద్ర మంత్రులు, ఎన్డీఏ నేతలతో కలిసి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.



# కాబోయే అమ్మ ఆరోగ్యంగా ఉండాలి

## తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పూర్ణచంద్రరావు

2లో




# హరిహర నామస్మరణతో మార్మోగిన మబగాం

- ఆధ్యాత్మికతతో మనసు పులకించిపోయింది
- వైసీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

**నవతరం-మబగాం**

ఆధ్యాత్మికత భావనతో, మనసు పులకించిపోయిందని, వైసీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట నియోజకవర్గం, పోలాకి మండలం, మబుగాం గ్రామంలో దేవీ ఉపాసకులు శృంగారం లక్ష్మీధనుంజయ శర్మ ఆధ్వర్యంలో శ్రీ ఉమారుద్ర శివాలయం, శ్రీ లక్ష్మీ వల్లభనారాయణస్వామి ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని అనేకమంది

-మిగతా 2లో



# ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ మృతికి సంతాపం తెలిపిన దువ్వాడ బాబా

**నవతరం -పలాస**

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధి, రిటైర్ డ్రైవర్ అన్నా బత్తుల వెంకటరమణ ఇటీవల మృతి చెందారు. పలాస రూరల్ మండలం రామకృష్ణాపురంలో మృతుడు అన్న బత్తుల వెంకటరమణ నివాసానికి ప్రముఖ న్యాయవాది, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ పలాస డిపో గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్( బాబా) తమ ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ సందర్భంగా దువ్వాడ శ్రీధర్( బాబా) మాట్లాడుతూ, ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్

-మిగతా 3లో



# ఎన్రోల్మెంట్ డ్రైవ్ క్యాంపెయిన్ విజయవంతం

- ఎంపీపీ స్కూల్ చిన్నకొత్తకోటలో ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవ
- ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన
- ప్రభుత్వ పాఠశాలల సౌకర్యాలపై వివరాలు
- గ్రామస్తుల నుంచి మంచి స్పందన





**నవతరం -లావేరు**

ఈ మండలంలోని ఎంపీపీ స్కూల్ చిన్నకొత్తకోట ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్రోల్మెంట్ డ్రైవ్ క్యాంపెయిన్‌కు విశేష స్పందన లభించింది. పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు.
ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కింతలి ప్రసూన, ఉపాధ్యాయురాలు డి. మాధవి, ఉపాధ్యాయులు డి. శ్రీనివాసరావు పాల్గొని చిన్నకొత్తకోట, పెద్దకొత్తకోట గ్రామాల్లో పర్యటించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, డిజిటల్ బోధన వంటి అనేక సౌకర్యాలు అందుతున్నాయని తల్లిదండ్రులకు వివరించారు. సం ఎంతో ముఖ్యమని, సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని ఉపాధ్యాయులు కోరారు. గ్రామస్తులు కూడా ఈ కార్యక్రమానికి సహకరిస్తూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మద్దతు తెలిపారు.

# వీరాభయాంజనేయ ప్రతిష్టలో పోకతోట సింహాచలం

**నవతరం-శ్రీకాకుళం**

విశ్వహిందూ పరిషత్ మరియు బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వీర అభయాంజనేయ స్వామి విగ్రహ చర ప్రతిష్ట కార్యక్రమం తోటపాలెం జంక్షన్‌లోని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాలయం ఆవరణంలో అంగరంగ వైభవంగా జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూజ్య శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు ఒబిలిశెట్టి వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.
ముఖ్య అతిథిగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొనగా, విశిష్ట అతిథిగా నరసన్నపేట అసెంబ్లీ ఇంచార్జ్ దీూా-1 పోకతోట సింహాచలం గారు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, శ్రీ వీర అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టతో ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడుతుందని, ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
భక్తులు, విశ్వహిందూ పరిషత్ మరియు బజరంగ్ దళ్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లోకనాథం, ఆనందరావు, ఉపాధ్యక్షులు శ్రీరంగ మధుసూదన్ రావు, ప్రాంత బజరంగ్ దళ్ నాయకుడు రావడ రాజశేఖర్, జిల్లా ప్రముఖ్ కొయ్యన కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హరిహర నామస్మరణతో మార్మోగిన మబగాం

**మొదటిపేజీ తరువాయి**

భక్తుల నడుమ శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హాజరైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, వైయస్సార్ కాంగ్రెస్ బిసి కళింగవైశ్య రాష్ట్ర అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులు అంధవరపు సూరిబాబు, రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ బిసి వెలమ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, వైయస్సార్ కాంగ్రెస్ జిల్లా కోశాధికారి తంగుడు నాగేశ్వరరావు హాజరై, శృంగారం లక్ష్మీధనుంజయ శర్మను ఘనంగా సత్కరించారు. ఇంతటి గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని చేపట్టినందుకు ఆయనను అభినందించారు. ఆ హరిహరుల కృపతో లోకకళ్యాణం జరగాలని ఆకాంక్షించారు.
మబుగాం గ్రామంలో హరిహరుల నామస్మరణతో గొప్ప ఆధ్యాత్మిక శోభసంతరించుకుంది.
కార్యక్రమంలో భాగంగా మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, వైయస్సార్ కాంగ్రెస్ యువనేత డా. ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఐదువేల మందికి అన్నప్రసాద వితరణ నిర్వహించారు.
హరిహర నామస్మరణతో మార్మోగిన మబగాంతో పాటు, పరిసర గ్రామాల ప్రజలు తండోపతండాలుగా హాజరయి ఆలయాలను దర్శించుకున్నారు.

# కాబోయే అమ్మ ఆరోగ్యం గా ఉండాలి

**నవతరం -అమరావతి**

కాబోయే అమ్మ ఆరోగ్యంగా ఉండాలని,వివిధ గ్రామాల నుండి ప్రతినెల తొమ్మిదవ తేదీన పలు రకాల వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణీలకు రెండు సంవత్సరాలుగా జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు మరువలేని వని తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ,బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు అన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం 75 తాళ్లూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోగులపాటి రమాదేవి,రాజు దంపతుల సహకారంతో శనివారం గర్భిణీలకు వారి సహాయకులకు భోజనంతోపాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్న సంకల్పంతో గర్భిణీలకు రెండు సంవత్సరాల నుండి పోషకాహారాన్ని అందిస్తున్న జన చైతన్య సమితి నిర్వాహకులు అభినందనీయులని అన్నారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందించటానికి మంచి మనసుతో ముందుకు వచ్చిన గోగులపాటి రాజు కుటుంబ సభ్యులు ఆదర్శనీయులని అన్నారు. రాజు మాట్లాడుతూ సామాజిక సేవలో జనచైతన్య సమితి దశాబ్దాల కాలంగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు.
ఈకార్యక్రమంలో జనచైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు దాసరి విజయ్ బెన్నిబాబు, కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్,వాకా ప్రవీణ్ కుమార్,అందే నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. భోజనంతోపాటు కోడిగుడ్లు,యాపిల్ కాయలు, దానిమ్మకాయలు, అరటి పండ్లు,డ్రైఫ్రూట్ లడ్లు, కొబ్బరితో తయారుచేసిన ఉండలు,ఖర్జూర పళ్ళు వేరుశనగ విత్తనాలతో తయారుచేసిన వేరుశనగ ఉండలను పంపిణీ చేశారు.

# నాలుగు నెలలు నీటిలో మునిగి ఉండే... ఉమ్మేడ ఉమామహేశ్వర ఆలయం నిజాంబాద్ జిల్లా





నిజామాబాద్ జిల్లా ఉమ్మేడ గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయం శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పెరిగినప్పుడు మునిగిపోతుంది. ప్రాజెక్టు నీటిమట్టం 75 అడుగులు రాగానే ఆలయానికి నీరు రావడం ప్రారంభమవుతుంది శ్రీ ఉమామహేశ్వర ఆలయానికి సుమారు 1000 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ ఆలయం గోదావరి పరివాహక ప్రాంతంలో ఉంటుంది. పూర్తిగా రాతితో కట్టబడిన దేవాలయం. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ 1075 అడవులకు చేరుకోగానే ఆలయంలోకి వెనుక నుండి నీరు వస్తుంది. 1085 అడుగులకు చేరుకోగానే శ్రీ ఉమామహేశ్వర ఆలయం గర్భగుడి పూర్తిగా నీటిలో మునిగిపోతుంది. నీటిమట్టం 1070 అడుగులకు చేరుకోగానే ఆలయం అలాగే ఉంటుంది. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి ఉత్సవాలకు ఉమామహేశ్వరుడు ప్రజలకు దర్శనం ఇస్తాడు ఉమాదేవి మహేశ్వరుడు ఉండడంతో ఈ ఆలయానికి ఉమామహేశ్వరుడు అనే పేరు వచ్చిందని చెబుతారు.

త్రేతా యుగములో రామచంద్ర మూర్తి అరణ్యవాసం సమయంలో గోదావరి పరిక్రమ చేస్తున్నప్పుడు ఉమ్మడి పరిసర ప్రాంతాలలో ఒకరోజు ఉన్నారంట. శ్రీరాముడు ఉదయాన్నే లేచి సంధ్యావందనం చేసుకొని ఇసుకతో సైకత లింగాన్ని తయారుచేసి పూజించారని స్థలపురాణం చెబుతోంది. 11వ శతాబ్దంలో కళ్యాణి చాళుక్యుల ఐదవ విక్రమార్కుడు ఈ ప్రాంతాన్ని పరిపాలించేవారు. వారు ఈ స్థల పురాణాన్ని తెలుసుకొని సతీ సమేతంగా ఉమాదేవి మహేశ్వరులకు ఆలయాన్ని నిర్మించారు.

ఈ ఆలయం ప్రతినిధిగా మహామండలేశ్వరుడు కప్పం వసూలు చేస్తూ పరిపాలించేవారు. ఆ సమయంలో ఉమ్మేడ ప్రాంతంలో భయంకరమైన అంటువ్యాధులు సోకాయి. చాలామంది ప్రజలు ప్రాణాలు వదులుతున్నారు. విపత్తు నుంచి బయటపడడానికి ఏదైనా మార్గం చూపాలని పురోహితులను అడిగారు, గర్భగుడిలో ఉన్నటువంటి ఉమాదేవికి చంద్రగ్రహణము, సూర్యగ్రహణం సమయంలో మహా చండీ యాగం చేయాలని పురోహితులు సూచించారు. గ్రహణకాలంలో గోదానము. భూదానము, సువర్ణ దానం చేసి విశేషమైన పూజలు నిర్వహించగా ప్రజలు సురక్షితంగా బయటపడ్డారు. ఆనాటి నుంచి ఉమామహేశ్వర ఆలయం లోని ఉమాదేవి నుంచి ఉ ను మహేశ్వరి నుంచి మా ను తీసుకుని ఉమామహేశ్వరుల పేరుతో ఉమ్మేడ గ్రామంగా వెలిసింది.

ఉమామహేశ్వర ఆలయం నుంచి ఏర్పడింది ఉమ్మేడ గ్రామం. గర్భగుడిలో ఉన్న శివలింగంపై త్రినేత్రం ఉంటుంది. త్రినేత్రమనేది కాశీలోని శివలింగానికి, తరువాత ఉమామహేశ్వరుని ఆలయంలోని శివలింగానికి మాత్రమే ఉంటుంది. ఆలయానికి ధ్వజస్తంభం లేదు. కానీ 108 దీపాలతో రాతి దీప స్తంభము ఉంది. ఉజ్జయిని మహంకాళి మందిరంలో రాత్రి దీపం ఉంది, ఆ తర్వాత ఉమామహేశ్వరాలయంలోని ఉంది మహాశివరాత్రి రోజున కార్తీక పౌర్ణమి రోజున ఈ రాతి ధూపం పై గండ దీపం వెలిగిస్తారు. అలాగే లక్ష దీపోత్సవ కార్యక్రమం కూడా నిర్వహిస్తారు.

గర్భగుడిలో శివలింగం వెనకాల ఉన్నటువంటి దీపము వెలిగించామంటే అందులోని ద్రవ్యము, వత్తులు అయిపోయేంతవరకు ఎంతటి గాలి వచ్చినా వెలుగుతూనే ఉంటుంది. ఉమామహేశ్వర ఆలయంలో ద్వారాలు ఉండవు. ఎందుకంటే గంగమ్మ తల్లి రావడానికి, శివలింగానికి అభిషేకం చేయడానికి ప్రత్యేకంగా నిర్మించిన దేశాలయం ఇది. ఫిబ్రవరి 25, 26, 27 మూడు రోజులపాటు ఇక్కడ శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. శ్రీ ఉమామహేశ్వర ఆలయానికి ఉభయ ఆలయాలైనటువంటి కాలభైరవ దేవస్థానం, పంచముఖ హనుమాన్ ఆలయం, బుర్ర గణపతి ఆలయాలలో ఊరు కమిటీ తరఫున విశేషమైన పూజలు నిర్వహిస్తుంటారు. ఉమామహేశ్వర క్షేత్రానికి క్షేత్రపాలకుడు కాలభైరవుడి అనుమతితో ఇక్కడ ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 75 అడుగులు రాగానే ఆలయానికి నీరు రావడం ప్రారంభం అవుతుంది పురాతన చరిత్ర కలిగిన శ్రీ ఉమామహేశ్వర ఆలయం నాలుగు నెలలు నీటిలోనే ఉంటుంది.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# ఇదిగో..మెమో అదిగో..సరెం"డర్"

ఉద్యోగుల మానసిక కట్టడికి
అధికార అ(ద)స్త్రం

సార్..నమస్కారం.

ఏమయ్యా..ఆ.. మేడం
నీ..పై ఫిర్యాదు చేసింది.
ఫీల్డ్ లో కనవడత"లేవని"
వెళ్ళి.. కలువు
సారీ చెప్పి.అటెండెన్స్ సర్టిఫికెట్
తెచ్చుకో..లేకపోతే ఈ నెల
సాలరీ అవుతాము.

అదేందీ సార్
నేను..
నౌకరీ చేసేది ఇక్కడ
అక్కడినుంచి ఎట్లా అటెండెన్స్
సర్టిఫికెట్ తేవాలి.

ఏమో అదంతా తెల్వద్..
పో..పొయ్యి, ఆ మేడం ను
"కల్సి" రా.. పో..

అలాగే సార్..వెళ్తా.

నమస్తే..మేడం.
ఓ..డి టి గారా?!
కూర్చోండి.

మీరు..మా ఆఫీసుకు రావడం
ఇదే మొదటి సారనుకుంటా?!

అవును మేడం.ఫీల్డ్ లో నే..
ఎక్కువగా ఉంటా, కాబట్టి
ఆయా..ఆఫీసులకు వెళ్ళటం
తక్కువ.

ఓ..హో.. అలాగా..
ఇపుడు కూడా భయపడి వచ్చావ్
..
అంతే కానీ నోటీసు రాకపోతే..
రాకపోయేవాడివి.

"నాకు..ఫలానా ఆఫీసుకు
వెళ్ళవద్దని, ఫలానా అధికారిని
కలవవద్దు అని ఏమి ఉండదు
మేడం".

"నేను పర్యవేక్షించాల్సిన ఏరియా
ఎక్కువగా ఉండటం
మూలంగా..
ఎక్కువగా రైస్ మిల్లులు
తిరగడానికే సమయం
సరిపోతుంది".
అంతే తప్పు..
"ఆ సార్ ను కలవద్దు..
"ఈ మేడం ను కలవద్దు" అనే
ఇంటెన్షన్ ఉండదు.

ప్లీజ్.."ఫర్ గివ్ మీ"..మేడం.
"ఇఫ్?! అయామ్ నోయింగ్..లీ
ఆర్,అన్ నోయింగ్ లీ..డిడ్ ఎనీ
మిస్టేక్"
.
"మై సిన్సియర్ అపాలజీ ఫర్
ఎనీ థింగ్ వ్రాంగ్ ఫ్రమ్ మై
సైడ్"

సరే..సరే
"పో.. పొయ్యి..
నీ డ్యూటీ నువు చేసుకో పో"..

థ్యాంక్ యూ మేడం.

కట్ చేస్తే..
ఆఫీసు నుంచి ఫోన్.

"సార్..
మిమ్మల్ని సరెండర్ చేశారు.
ఆఫీసుకు వచ్చి..కాపీ
తీస్కపోండి".

"అదేంది
నేను..మెమో కు వివరణ కూడా
ఇచ్చాను కదా"..
"నా తప్పు ఏమి లేదని".

వివరణ తీసుకున్నాక..
ఊరుకుని..వారం,పది రోజులు
ఆగి
ఇపుడు..ఈ సరెండర్ ఏంది.

ఒక వేళ నేను తప్పు చేసి
ఉంటే?!
నేను ఇచ్చిన వివరణ
సంతృప్తికరంగా లేకపోతే.
అపుడు కూడా షో కాజ్ నోటీసు
ఇచ్చే అవకాశం ఉంది.

అంతే కానీ
నా..తప్పు లేదు మొర్రో..
నేను ఏ తప్పు చేయలేదు..
మహా ప్రభో..అని
విన్నవించాను.

నా డ్యూటీ సక్రమంగా చేశానని
మొత్తుకున్నా..ను.

ఇంత చేసినా..
ఈ సరెండర్ ఏంటో..నాకు
అర్థం కావడం లేదు.

సార్..ఇందులో,ఏదో కుట్ర
ఉంది.
కావాలని మీరు నన్నే ఇబ్బంది
పెడుతున్నారు.

అదే ఇతరులను ఇలాగే జస్ట్
డిస్టర్బ్ చేసే ప్రయత్నం
చేయండి.
ఓ పది,పదిహేను మంది
వచ్చి..కూర్చొని..
మాది ఆ..సంఘం.
మాది ఈ..అసోసియేషన్ అని
చెప్పి..
గట్టిగా కొట్లాడి
కనీసం మెమో ఇచ్చే ధైర్యం
ఉందా?! అన్నంత సీన్ క్రియేట్
చేస్తారు.
అధికారుల గుండె ఆగి పోయేలా
దడ పుట్టిస్తారు.

అమ్మో..విజయ్ ను
ముట్టుకుంటే?!ధర్నా చేస్తారు.
అనుకునేలా
భయ"పెడతారు.

"నా..వైపు నుంచి తప్పు లేదని
మీక్కూడా తెలుసు.
ఐనా..సరెండర్ చేస్తున్నారు".

"నేను కోర్టు కు వెళ్తా..సార్
న్యాయం కోసం"..

మాచన రఘునందన్
పౌర సరఫరాల శాఖ
ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ
తాశిల్దార్
9441252121



# కొత్త ఉపాధి జిగేలు

ఒకప్పుడు ఇంజనీరింగ్ లేదా ఏదైనా పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్స్ పూర్తి చేస్తే వెంటనే సాఫ్ట్వేర్ సంస్థలలో ఏదో ఒక ఉద్యోగం వచ్చేది. కొందరు అమెరికా వెళితే, మరికొందరు బెంగళూరు, హైదరాబాద్, పూణే వంటి మహా నగరాల్లో సెటిల్ అయ్యే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అమెరికా ఆర్థిక విధానాలు, కృత్రిమ మేధ, ఐ టీ రంగంలో ఉన్న తీవ్ర పోటీ కారణంగా క్రమంగా ఐ టీ రంగం కుదేలు అవుతుంది. దీనితో కొందరు తమకు ఉద్యోగాలు రావేమో నని దిగులు చెందుతున్నారు.

అయితే ఇటువంటి పరిస్థితి ఎల్లప్పుడూ ఉండదు. ఇప్పుడు కొత్త అవకాశాలు తలుపు తడుతున్నాయి. డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, సౌర విద్యుత్తు, డ్రోన్ టెక్నాలజీ తదితర రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

కోవిడ్ సంక్షోభం తర్వాత ఇప్పుడు అందరి దృష్టి ఆరోగ్యంపై పడింది. దీనితో హెల్త్ కేర్ సెంటర్స్ పెరిగాయి. జర్మనీలో నర్సులకు డిమాండ్ పెరిగింది. అదే విధంగా ప్రస్తుతం సెమీ కండక్టర్ ఇంజనీరింగ్ కు మంచి డిమాండ్ వుంది.

ఇంకా అనేక రంగాలు అభివృద్ధి చెందుతున్నాయి. కృత్రిమ మేధలో మన దేశానికి సుమారు పది లక్షల మంది నిపుణులు కావాలి. ఉపాధ్యాయ వృత్తికి ఎప్పుడూ డిమాండ్ ఉంటూనే ఉంటుంది.

కొత్త రకం నేరాలు పెరుగుతున్నాయి. దీనితో సైబర్ సెక్యూరిటీ రంగం అభివృద్ధి చెందుతుంది. కొన్ని దేశాల్లో వ్యవసాయ రంగానికి డిమాండ్ వుంది.

ఇప్పుడు అందరూ  అందంపై దృష్టి పెడుతున్నారు. దీనితో బ్యూటీషియన్స్ కు మంచి డిమాండ్ పెరిగింది.

మరోవైపు వేడుకలు పెరిగాయి. దీనితో ఈవెంట్ మేనేజ్ మెంట్ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ఇంకా క్లౌడ్ కిచెన్స్ కు డిమాండ్ పెరుగుతుంది. స్పా సెంటర్స్ సంఖ్య పెరుగుతుంది.

ప్రభుత్వ ఉద్యోగాలు ఎప్పుడూ పది శాతమే ఉంటాయి.

ఏమి చేయాలి..?

ఒక సారి ఉద్యోగం వస్తే అదే శాశ్వతం కాదు. కొత్త విషయాలు నేర్చుకోవాలి. ఇంగ్లీష్ తో పాటు ఏదో ఒక విదేశీ భాష నేర్చుకుంటే మంచిది. పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలు చదవాలి. ఉద్యోగం రాలేదని నిరాశ చెందకూడదు. కొంత సమయం ఎదురు చూడాలి. దుబారా వ్యయాన్ని తగ్గించుకోవాలి. అమెరికా వెళ్లడం ఒక్కటే జీవిత ధ్యేయం కారాదు. ఈ రోజు అనేక దేశాలు ఆహ్వానం పలుకుతున్నాయి.

అన్నింటికంటే స్వీయ క్రమ శిక్షణ చాలా అవసరం. మూస పద్ధతులు మానుకోవాలి.

చివరగా చెప్పేది ఏమిటంటే ఒక రంగం దెబ్బతిన్నా, కొత్త అవకాశాలు వస్తూనే ఉంటాయి. మా చిన్నప్పుడు టీవీ లు వచ్చాయి కాబట్టి సినిమా హాళ్ళు ఉండవు అన్నారు. ఇప్పుడు మల్టీ ప్లెక్స్ ఉన్నాయి కదా.. ఓ టీ టీ లలో చాలా మంచి సినిమాలు వస్తున్నాయి కదా..రూపం మారుతుంది అంతే.


యం.రాం ప్రదీప్

# మందు గ్లాసుల... మరణ మృదంగం..?

మొన్న సరదాగా మొదలైంది...
నిన్న చెలిలా చెంతకు చేరింది...
నేడు అలవాటై అల్లుకుంది...
రేపు వ్యసనమై వేధిస్తుంది...
ఎల్లుండి మొండి వ్యాధియై...
ఊపిరిమీద ఉచ్చు బిగిస్తుంది...

అది మద్యమైయినా...
అది మత్తు పదార్థమైనా...
అది ధూమపానమైనా...
గుట్కైనా...గంజాయైనా...డ్రగ్సైనా...

మొదట మత్తు...మైకం...
మనసును మురిపిస్తాయి...
మెల్లగా మోహంలో ముంచేస్తాయి...
ఆపై మృత్యువును ముద్దాడమంటాయి...

ఒక్క గ్లాసు...ఒక్కోసారి
ఉత్సాహం కాదు...ఉరితాడు...
ఒక్క పెగ్గు...ఒక్కోసారి
స్టైల్ కాదు...శవపేటిక...
ఒక్క చిటికెడు మత్తు...ఒక్కోసారి
సరదా కాదు...సమాధికి చిరునామా...

గ్లాసులో కనిపించేది
మందే కావచ్చు...కానీ...
అందులో కరిగేది ఆరోగ్యం...
అందులో మునిగేది ఆస్తిపాస్తులు...
కుటుంబ గౌరవ మర్యాదలు...
కన్నీరు కార్చేది కుమిలే కుటుంబం...
అందులో సమాధి అయ్యేది
అందరి ముందరి అందమైన జీవితం...

ఓ మందుబాబుల్లారా...!
"మందు విందు పొందు" అంటూ
మత్తులో మునిగి పోకండి...
మందు గ్లాసులో మత్తు మైకం కాదు...
"మృత్యువు" దాగిఉందని మరువకండి...

మందుకు బానిసలు కాకండి...
మౌనంగా మత్తుకు బలైపోకండి...
అప్పుల అగ్నిగుండంలో
అందమైన కుటుంబాలను
ఆహుతి చేయకండి...
అకాల మరణాలతో ఆనందకర
జీవితాలను అంతం చేయకండి...

భగవంతుడు
వరంగా ప్రసాదించిన
ఈ బంగారు బ్రతుకును...
మత్తుమంటల్లో కాల్చి మసిచేయకండి
సంతోషపు సుగంధపరిమళాలతో



నింపి ఈ జన్మను సార్థకం చేసుకోండి...
పలికండి మత్తుకు స్వస్తి...
ఆపై ఆరోగ్యమే మీకు తరగని ఆస్తి...



కవి రత్న సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ మృతికి సంతాపం తెలిపిన దువ్వాడ బాబా

**మొదటి పేజీ తరువాయి**

యూనియన్  కార్మిక ప్రతినిధిగా అన్నా బత్తుల వెంకటరమణ  చేసిన సేవలు మరువలేనివని, ఒక కార్మిక నేతగా ఆయన చేసిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయని, తనవంతుగా వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నా బత్తుల దిలీప్ కుమార్, సోమేశ్వరరావు, అన్నా బత్తుల బాలరాజు, రవి, హేమాచలం, రామ్ నరేష్ యాదవ్, సుబ్బిరెడ్డి, జుత్తు పున్నయ్య  తదితరులు పాల్గొన్నారు.

# సతీ లీలావతి.. పేరు గొప్ప



**మూవీ రివ్యూ  : 'సతీ లీలావతి'**
**రేటింగ్ - 2.25/5**

**నటీనటులు: లావణ్య త్రిపాఠి- దేవ్ మోహన్- మడోన్నా సెబాస్టియన్- నరేష్- పవిత్ర- సప్తగిరి- మొట్ట రాజేంద్రన్ తదితరులు సంగీతం: మిక్కీ జే మేయర్ ఛాయాగ్రహణం: బినేంద్ర మేనన్ మాటలు: ఉదయ్ పొత్తిపాడు నిర్మాత: నాగమోహన్ కథ-స్క్రీన్ ప్లే-దర్శకత్వం: తాతినేని సత్య**

పెళ్లి తర్వాత సినిమాల నుంచి కొంచెం గ్యాప్ తీసుకున్న లావణ్య త్రిపాఠి.. తర్వాత నటించిన చిత్రం 'సతీ లీలావతి'. మలయాళ నటుడు దేవ్ మోహన్ ఆమెకు జోడీగా నటించాడిందులో. ఎస్ఎంఎస్.. భీమిలి కబడ్డీ జట్టు చిత్రాల దర్శకుడు తాతినేని సత్య రూపొందించిన ఈ చిత్రం ఈ రోజే థియేటర్లలోకి దిగింది. మరి ఈ సినిమా లావణ్యకు ఎలాంటి ఫలితాన్నిచ్చేలా ఉందో చూద్దాం పదండి. కథ: లీల (లావణ్య త్రిపాఠి) ఒక దర్శకురాలు. ఎప్పుడూ గొడవ పడుతూ ఉండే తన తల్లిదండ్రులను చిన్నతనం నుంచి చూస్తూ వచ్చిన లీల.. తనకు కాబోయే వాడితో సంతోషంగా గడపాలనుకుంటుంది. అనాథ అయిన సేతుపతి (దేవ్ మోహన్)ని ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె.. తొలి ఏడాది తర్వాత పనిలో పడి భర్తను పట్టించుకోదు. దీంతో అతను మరో అమ్మాయి ఆకర్షణలో పడి లీల నుంచి విడాకులు తీసుకోవడానికి సిద్ధపడతాడు. ఐతే భర్త విడాకులు అడగ్గానే లీల తనలోని విధ్వంసక కోణాన్ని బయటపెడుతుంది. లీలలోని ఈ కోణాన్ని చూశాక సేతుపతి ఎలా స్పందించాడు.. ఇద్దరి మధ్య ఘర్షణ ఎక్కడిదాకా వెళ్లింది.. చివరికి వీళ్లిద్దరూ కలిసి ప్రయాణం సాగించారా లేదా అన్నది మిగతా కథ. కథనం-విశ్లేషణ: సతీ లీలావతి.. ఈ టైటిల్ చెప్పగానే 90వ దశకంలో లోకనాయకుడు కమల్ హాసన్ హీరోగా లెజెండరీ డైరెక్టర్ బాలు మహేంద్ర రూపొందించిన క్లాసిక్ కామెడీ గుర్తుకు వస్తుంది. ఇలాంటి టైటిల్ పెట్టాలంటే ఆ స్థాయిలో కాకపోయినా.. దానికి కాస్తయినా దగ్గరగా నిలవగలిగే కథాకథనాలు రాసుకుని ఉండాలి. తెరపై ఒక మోస్తరుగా అయినా డ్రామాను-నవ్వులను పండించగలగాలి. కానీ ఈ కొత్త 'సతీలీలావతి'లో అంత స్థాయిలో లేవు. కమల్ క్లాసిక్ మూవీని గుర్తు చేసే కాన్సెప్టే తీసుకున్నారు కానీ.. బలం లేని పాత్రలు.. వాటి మధ్య కుదరని ఎమోషన్.. పెద్దగా నవ్వు రాని కామెడీ.. అయోమయంగా సాగే కథనంతో 'సతీ లీలావతి' అంత మెప్పించదు . చెప్పాలనుకున్న పాయింట్ అర్థం కాని విధంగా గందరగోళంగా సాగే ఈ సినిమా పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. పెళ్లయిన కొన్నేళ్లకు భార్య మీద మోజు తీరి మరో అమ్మాయి ప్రేమలో పడే భర్త కథతో తెరకెక్కిన సినిమా పాత 'సతీలీలావతి'. అందులో భార్య పాత్ర అంత చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండదు. కొత్త 'సతీలీలావతి'లో కూడా పెళ్లయిన కొన్నేళ్లకు భార్య నుంచి విడిపోవాలనుకునే భర్తను పాత్రను చూస్తాం. కాకపోతే ఇప్పటి కాలానికి అనుగుణంగా భార్యను గడుసుదానిలా చూపించారు. ఆమె పాత్రనే హైలైట్ చేయడానికి ప్రయత్నించారు. ఆమె గడుసుదనం ఏ స్థాయిలో ఉంటుందంటే.. తన నుంచి విడిపోతానని భర్త అనడం ఆలస్యం అతడి మీద పాశవిక దాడి చేస్తుంది. తనను ఒక గదిలో బంధించి పడేస్తుంది. ఆ తర్వాత అతడిలో ఆ భార్య ఎలా పరివర్తన తీసుకొచ్చిందనే నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. ఐతే ఆ పాయింట్ మీద కుదురుగా కథ నడిచి ఉంటే.. ఇదొక మంచి ఎమోషనల్ డ్రామా అయ్యుండేది. కానీ అసలు విషయం మీద ఫోకస్ పెట్టలేదు. మధ్యలో అవసరం లేని పాత్రలన్నీ వస్తుంటాయి. వాటి మీద గందరగోళంగా.. ఏ పర్పస్ లేకుండా సన్నివేశాలు నడుస్తుంటాయి. ఏ పాత్రకు ఎందుకు కథలోకి వస్తోందో.. దాని ఉద్దేశమేంటో అర్థం కాదు. పెళ్లయిన కొన్నేళ్లకు భార్యాభర్తల మధ్య అపార్థాలు రావడం.. ఇద్దరి మధ్య దూరం పెరగడం చాలామందిలో జరిగేదే. ఇద్దరిలో ఒకరు మరొకరిని అశ్రద్ధ చేసినా.. లేదా ఒకరు ఇంకొకరిని అపార్థం చేసుకున్నా.. అవతలి వ్యక్తికి తన తప్పేంటో తెలిసేలా చెయ్యడానికి కొన్ని మార్గాలు ఉంటాయి. ఏ మార్గం ఎంచుకున్నా తెర మీద అవతలి పాత్ర మాత్రమే కాదు.. ప్రేక్షకులు కూడా కన్విన్స్ అయ్యేలా పరిష్కారం చూపించాలి. కానీ 'సతీ లీలావతి'లో తన నుంచి విడిపోవాలని అనుకునే భర్తను మార్చడానికి హీరోయిన్ ఎంచుకునే మార్గం సిల్లీగా అనిపిస్తుంది. ఈ దశలోనూ ఆమె భర్తలో పరివర్తన తెచ్చేలా తన ప్రవర్తన ఉండదు. ఆ క్యారెక్టర్ని చూస్తే భర్త ఆమె నుంచి విడిపోవడం కరక్టే అని ఆడియన్సుకి అనిపిస్తుంది. భార్య వ్యవహారం ఇలా ఉంటే భర్తది ఇంకా విచిత్రమైన క్యారెక్టర్. ఇష్టం లేకుండా పెళ్లి చేసుకున్నా అంటాడు. మళ్ళీ ప్రేమ కురిపిస్తాడు. అంతలోనే తూచ్ అంటాడు. సినిమా అంతా భార్యతో నువ్వు వద్దే వద్దు అన్నవాడు.. చివర్లో ఏవో నాలుగు ఎమోషనల్ డైలాగులు చెప్పేయగానే కరిగిపోతాడు. వీళ్లిద్దరి మధ్యలోకి వచ్చే ప్రేయసి పాత్ర సైతం ఇంతే అయోమయంగా అనిపిస్తుంది. సినిమా నిండా బోలెడన్ని పాత్రలు ఉంటాయి కానీ.. ఇలాగే ఒక్కదానికి కూడా ఒక తీరు తెన్ను ఉండదు. ఎక్కడా పాత్రల మధ్య కానీ.. కథలో కానీ ఎమోషన్ వర్కవుట్ కాక కంగాళీగా తయారైంది సతీ లీలావతి. సెకండాఫ్ లో కొన్ని కామెడీ సీన్లు ఒక మాదిరిగా అనిపిస్తాయి. క్లైమాక్స్ పర్వాలేదు. నటీనటులు: లీల పాత్రలో లావణ్య త్రిపాఠి బాగా పెర్ఫామ్ చేసింది. అల్లరి సన్నివేశాల్లోనే కాక ఎమోషనల్ సీన్స్ లోనూ ఆమె బాగా నటించింది. నటనలో గ్యాప్ తర్వాత ఆమె కొంచెం బబ్లీగా తయారైంది.ల

దేవ్ మోహన్ చూడ్డానికి బావున్నాడు. నటన విషయంలోనూ ఆకట్టుకున్నాడు. తన తెలుగు డబ్బింగ్ కూడా బాగానే సాగింది. ప్రేమమ్ ఫేమ్ మడోన్నా సెబాస్టియన్ మలయాళి అమ్మాయిగా తనకు సూట్ అయ్యే పాత్రలో కనిపించింది. నరేష్ టాలెంటుకు తగ్గ పాత్ర పడలేదు. సప్తగిరి కాసేపు నవ్వించాడు. వీటీవీ గణేష్ ను దర్శకుడు సరిగా ఉపయోగించుకోలేదు. మొట్ట రాజేంద్రన్.. మిగతా ఆర్టిస్టులు పర్వాలేదు. సాంకేతిక వర్గం: 'సతీ లీలావతి'లో సాంకేతిక నిపుణుల పనితీరు మెప్పిస్తుంది. మిక్కీ జే మేయర్ పాటలు తన స్థాయికి తగ్గట్లు లేవు కానీ.. సందర్భానికి తగ్గట్లు బాగానే కుదిరాయి. పెళ్లి పాట మంచి హుషారు పుట్టిస్తుంది. కెమెరామన్ బినేంద్ర మేనన్ మంచి విజువల్స్ తో ఆకట్టుకున్నాడు. నిర్మాణ విలువలు బాగున్నాయి. కథకు తగ్గట్లు ఖర్చు పెట్టారు. ఉదయ్ కొన్ని చోట్ల సంభాషణల్లో డెప్త్ చూపించాడు. కథకుడు - దర్శకుడు తాతినేని సత్య ఎంచుకున్న కాన్సెప్ట్ మంచిదే. కానీ కథను ఒక తీరుగా చెప్పడంలో అతను ఫెయిలయ్యాడు. అతను కథను మొదలుపెట్టిన విధానమే అంత ఆసక్తికరంగా లేదు. నరేషన్ ఆద్యంతం గందరగోళంగా సాగింది. సెకండాఫ్ లో కొంత మేర ఎంటర్టైన్మెంట్ పండించినా.. అది సరిపోలేదు.

# అన్నదాన పథకానికి లక్ష రూపాయల విరాళం



**నవతరం-శ్రీకాకుళం**

ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామివారిని శుక్రవారం ఉదయం శ్రీకాకుళం వాస్తవ్యులు కింతలి మురళీధర్, నిర్మల దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన పథకం నిమిత్తం రూ.1,00,000 నగదును ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి ప్రసాద్‌కు అందజేశారు.అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో దంపతులను ఆశీర్వదించి, స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి కె.ఎన్.వి.డి.వి ప్రసాద్ పాల్గొన్నారు.

# ఎండ తీవ్రతలు తగ్గేవరకు మజ్జిగ సేవలు కొనసాగిస్తాం

### - పిల్లల వైద్య నిపుణులు జేసీ వినోద్ కుమార్ కూర్మాన



**నవతరం-శ్రీకాకుళం**

వేసవి ఎండ తీవ్రతలు తగ్గేవరకు మజ్జిగ సేవలు కొనసాగిస్తామని, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు జేసీ వినోద్ కుమార్ కూర్మాన అన్నారు. జేసిఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అధ్యక్షురాలు షర్మిల బృందం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ రోజు సేవలో భాగముగా జెసి సెనేటర్ వినోద్ కుమార్ కూర్మాన పాల్గొని, పాదచారులకు, వాహన చోదకులకు మజ్జిగను అందించి, జూనియర్ జేసీ జోన్ డైరెక్టర్ సింగూరు ప్రవీణ్ కుమార్ తోకలసి మాట్లాడుతూ గడిచిన రెండు రోజులుగా వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని, వడదెబ్బలు తగిలే ప్రమాదాలున్నాయని, ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలన్నారు. ద్రవరూపంలో ఉన్న ఆహారానికి ప్రాధాన్యతనివ్వాలని, కూరగాయలలో ఉప్పు, కారాలను తగ్గించి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, బార్లీ, సబ్జా గింజలు, పుచ్చకాయలు, నిమ్మ రసం లేదా తగినన్ని నీటిని తీసుకోవాలని, అనవసరంగా బయట తిరగకూడదని, మసాలాలు లేకుండా వుండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆరు బయట దొరికే ఆకర్షణీయంగా ఆహారం అనారోగ్యానికి కారణమని, దయచేసి వేసవి కొనసాగే వరకు జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు. అలాగే జెసిఐ సన్ రైజర్స్ ప్రతీ సంవత్సరం లాగానే, ఈ ఏడాది కూడా ఉచిత మజ్జిగ సేవను, వేసవి ముగిసేవరకు కొనసాగిస్తుందని, ఇందుకు సహకరించిన ప్రతీ దాతలకు, పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలన్నారు.
ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, వెంకటేష్ జూనియర్ జెసి శ్రావిక , తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీ కుటుంబంలో వెలసిన చదువుల తల్లి



**నవతరం టెక్కలి**

స్థానిక సంతబొమ్మాలి మండలం దండు గోపాలపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల లో 10వ తరగతి విద్యార్థిని మద్దెల.రమ్య పదవ తరగతి పరీక్షలో 581 మార్కులు సాధించి జిల్లావిద్యాశాఖ ప్రతిపాదించిన సిక్కోలు షైనింగ్ స్టార్ అవార్డ్ కు ఎంపికై నేడు శ్రీకాకుళం లోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవములో స్థానిక శ్రీకాకుళం శాసనసభ్యులు గుండు శంకర్, జిల్లావిద్యాశాఖాధికారి వారి చేతుల మీదుగా ప్రశంసాపత్రము, జ్ఞాపిక అందుకోవటం పట్ల పలువురు హర్షం వ్యక్తపరిచారు.
ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న మాట్లాడుతూ ఒక సాధారణ వ్యవసాయకూలీ కుటుంబానికి చెందిన రమ్య క్రమశిక్షణతో చదివి సంతబొమ్మాళి మండలంలో గల అన్నీ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులందరీ కంటే రమ్య ఎక్కువ మార్కులు 581 సాధించి మండలానికి, మరియు పాఠశాలకు పేరు తీసుకువచ్చిందనీ, రమ్య తరువాత బ్యాచ్ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిందని వారు కొనియాడారు. రమ్య విజయము పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, కమిటీ సభ్యులు గ్రామపెద్దలు, తల్లితండ్రులు సంతోషము వ్యక్తము చేశారు.

# దేశ సేవకు అంకితమైన గోఖలే

### - గాంధీజీకి రాజకీయ గురువుగా మార్గదర్శనం
### - గాంధీ మందిరంలో జయంతి వేడుకలు



**నవతరం-శ్రీకాకుళం**

భారత స్వాతంత్ర పోరాట చరిత్రలో గోపాలకృష్ణ గోఖలే ఎందరో దేశభక్తులను తయారు చేశారని గురజాడ విద్యాసంస్థల లెక్చరర్ సిహెచ్. రాజకుమార్, అవధాన పండితులు పైడి హరినాధరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చౌదరి రాధాకృష్ణ పేర్కొన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు సంఘసంస్కర్తలు తేజోమూర్తుల స్మృతి వనంలో గోపాలకృష్ణ గోఖలే 160వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గోఖలే విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో మితవాద ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన ప్రస్థానాన్ని వివరించారు. మహాత్మా గాంధీజీ కి రాజకీయ గురువుగా గోఖలే దిశా నిర్దేశం చేశారన్నారు. లాల్ బాల్ పాల్ త్రయంతో స్వతంత్ర పోరాటాన్ని ముందుకు తీసుకెళుతున్న క్రమంలో దక్షిణాఫ్రికా నుంచి గాంధీజీని భారతదేశానికి రప్పించి ఇక్కడ ప్రజల పరిస్థితులని, స్వాతంత్ర పోరాటశీ జరుగుతున్న తీరుని ఆకలింపు చేసుకునేందుకు గోఖలే సహకరించారన్నారు. సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సంస్థను స్థాపించి దేశం పట్ల సేవ చేసే ఆలోచన యువతలో గోఖలే నింపారన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ మందిరం ప్రతినిధులు నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, నక్క శంకర్రావు, పి.పద్మావతి, మెట్ట అనంతం భట్లు, శాస్త్రి తదితరులు ఉన్నారు.ం

# దేశ సరిహద్దు రక్షకుడికి స్వగ్రామంలో ఘన స్వాగతం



**నవతరం-శ్రీకాకుళం**

దేశ రక్షణలో రెండున్నర దశాబ్దాల కాలం పాటు అంకితభావంతో పనిచేసి, సరిహద్దు భద్రతా దళం (BSF)లో హెడ్ కానిస్టేబుల్‌గా పదవీ విరమణ పొందిన శ్రీ రట్టి శంకర్ గారికి తన స్వగ్రామమైన ఎర్రముక్కాంలో గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. సుదీర్ఘ సర్వీసు అనంతరం శనివారం ఆయన గ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు, మహిళలు మరియు యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనంగా స్వాగతం పలికారు.
శంకర్ గారు గ్రామంలోకి అడుగుపెట్టగానే మహిళలు మంగళ హారతులు ఇచ్చి, తిలకం దిద్ది ఆశీస్సులు అందజేశారు. గ్రామస్తులు ఆయనను పూలమాలలతో ముంచెత్తి, ఊరేగింపుగా గ్రామంలోకి ఆహ్వానించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడుతూ పలువురు ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.
దేశ సరిహద్దుల్లో కఠిన పరిస్థితులను తట్టుకొని సేవలందించిన శంకర్ గారు పదవీ విరమణ పొంది రావడం గ్రామానికే గర్వకారణమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.
ఉద్వేగభరిత వాతావరణం
తన సొంత మనుషుల మధ్య, ఇంతటి ఆత్మీయ స్వాగతం లభించడం పట్ల శంకర్ గారు ఉద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పించి అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల ప్రేమాభిమానాలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు.
ఈ కార్యక్రమంలో చిడిపల్లి దామోదర్ రావు, బైపల్లి బాబురావు ,కంబాల హేమ సుందర్ పొట్టి రాజ్ కుమార్ జేజేశ్వర రావు ,బైపల్లి పాపారావు గోవింద వెంకట్రావు, కంబాల చంద్రశేఖర్ , నేతాజీ యువజన సంఘ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొని ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

# “తన్ని తన్ని తరిమికొడదాం!”




ఓరుగల్లులో ఆ రాత్రి గాలి కూడా గట్టిగానే ఊపిరి తీసుకుంది. చౌరస్తాలో మైక్ పట్టుకున్న వృద్ధుడు ఒక్క మాట అన్నాడు
“ప్రజల్ని మోసం చేసే నాయకుడిని ఓటుతో తన్ని తన్ని తరిమికొడదాం!” ఆ మాట విన్న జనంలో ఒక్కసారిగా కదలిక వచ్చింది.
అది కోపం కాదు... మేల్కొలుపు.
ఒకప్పుడు నాయకుడు అంటే సేవ.
ఇప్పుడు చాలామందికి రాజకీయాలు అంటే వ్యాపారం. ఎన్నికల ముందు చేతులు జోడించడం... గెలిచాక గేట్లు వేసుకోవడం.
పల్లెలో నీళ్లు లేవు. యువకుడికి ఉద్యోగం లేదు.
రైతుకి గిట్టుబాటు లేదు.
కానీ సభల్లో మాత్రం గొప్ప గొప్ప మాటలు.
ఓరుగల్లు కోట గోడలు చూసి ఒక యువకుడు అడిగాడు: “ఈ నేల కోసం పోరాడిన వాళ్ల రక్తం ఎక్కడ? ఇప్పుడు కురుస్తున్నది కేవలం పోస్టర్ల రంగులేనా?”
అక్కడున్న ఓ కవి నవ్వుతూ చెప్పాడు
“కాళోజీ మాటల్లో ప్రజల శ్వాస ఉండేది బాబూ... ఇప్పుడు చాలామంది నాయకుల మాటల్లో కేవలం మైక్ సౌండ్ మాత్రమే ఉంది!”
జనం చప్పట్లు కొట్టారు.
మరో వృద్ధ రైతు ముందుకు వచ్చాడు.
“మా ఓటు వేసినప్పుడు మమ్మల్ని అన్నదాత అంటారు.
రేపు సమస్య చెబితే అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వరు.
ఇది ప్రజాస్వామ్యమా? లేక రాజస్వామ్యమా?”
ఆ ప్రశ్నకు వేదికపై ఉన్న నాయకులు ఒకరినొకరు చూసుకున్నారు.
అప్పుడు ఓ యువ గాయకుడు రసమయి శైలిలో దద్దరిల్లే స్వరంతో పాడాడు
“పల్లె చెమటతో పుట్టిన పదవి
ప్రజల కన్నీళ్లతో నిలవదు రా!
గద్దె ఎక్కినవాడా గమనించు
గడిచేది కాలం కాదు... ప్రజల సహనం!”
జనం ఊగిపోయారు.
ఆ గానం తర్వాత ఒక్కసారిగా నిశ్శబ్దం.
అప్పుడు మైక్ దగ్గరకు వచ్చిన ఓ అమ్మాయి ఇలా అంది: “నాయకులారా...
మాకు మీ పార్టీల రంగులు అవసరం లేదు.
మా ఊరికి నీరు కావాలి.
మా అన్నకు ఉద్యోగం కావాలి.
మా రైతుకు గౌరవం కావాలి.
అది ఇవ్వలేకపోతే...
ఈసారి ప్రజలు ప్రశ్నిస్తారు.
మరోసారి నిలదీస్తారు.
అప్పటికీ మారకపోతే
ఓటుతో తన్ని తన్ని తరిమికొడతారు!”
ఆ మాటతో సభ మొత్తం కదిలింది.
ఎందుకంటే ప్రజలు ఇప్పుడు కేవలం వినే స్థితిలో లేరు. చూస్తున్నారు.
గుర్తుపెట్టుకుంటున్నారు.
ప్రశ్నిస్తున్నారు.
ఓరుగల్లు నేల ఎప్పుడూ తిరుగుబాటుకే చిహ్నం.
అక్కడి గాలి కూడా ఒక హెచ్చరిక చెబుతోంది
“ప్రజల్ని చిన్నచూపు చూసిన ప్రతి నాయకుడిని చరిత్ర మర్చిపోదు...
ప్రజలు క్షమించరు!”
రాజకీయ నాయకులారా...
ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు.
పదవులు శాశ్వతం కాదు.
పోస్టర్లు శాశ్వతం కాదు.
కానీ ప్రజల తీర్పు శాశ్వతం.
గుర్తుంచుకోండి
“ప్రజల సహనం ఓటు వరకు మాత్రమే...
ఆ తర్వాత తీర్పు మొదలవుతుంది!”

**కాళోజీ స్ఫూర్తితో :**
**తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా**

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**